## క్లుప్తంగా

### రూ.4 లక్షలతో అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలస ఎస్సీ కాలనీలో రూ.4 లక్షలతో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ రెడ్డి పద్మావతి, ఎంపీటీసీ అట్టాడ సంధ్యారాణి బుధవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో సుమారు 80 మీటర్ల మేర సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మట్టిరోడ్డుతో ఇబ్బందులు పడేవాళ్లమని, ప్రస్తుతం సీసీరోడ్డు పనులు చేపట్టడంతో ఆ ఇబ్బందులు తొలగిపోతాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### త్రైతసిద్ధాంత ప్రచారం



కాపుశంబాంలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): త్రైతసిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీత, వేమన పద్యాల అనుబంధ గ్రంథాలపై గరివిడి మండలం కాపుశంబాం, ఎం.దుగ్గివలస, అప్పన్నవలస గ్రామాల్లో బుధవారం ప్రచారం చేపట్టారు. మోగి వేమన జయంతిని పురస్కరించుకుని త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. హిందూ సంప్రదాయాలు, పండగల విశిష్టతను, త్రైతసిద్ధాంత భగవద్గీతలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రామునాయుడు, గణేష్, రాజు, నాగభూషణరావు, అప్పారావు, పద్మ, మల్లీశ్వరి, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనల ప్రకారం పనులు చేయాలి



ఉపాధి పనుల మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి పనులు చేయాలని, అప్పుడే కూలీ గిట్టుబాటు అవుతుందని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అన్నారు. మండల కేంద్రంలోని పాతబంద చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు రావాలని, ఒకరికి బదులు మరోకరు హాజరు కావొద్దని సూచించారు. అలాగే 18 ఏళ్ల లోపు వారు పనులకు రాకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్ర సహాయకులు, మేట్లపై ఉందన్నారు. మస్టర్లు, కొలతలను పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. పని ప్రదేశం వద్ద నీడ, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

### ఆయుర్వేద వైద్యం ఉత్తమం



విద్యార్థులకు మందులు అందిస్తున్న డాక్టర్ జగన్మోహనరావు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చెన్నై ఐబీటీ సౌజన్యంతో డాక్టర్ జగన్మోహనరావు నేతృత్వంలో బుధవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఆయుర్వేదానికి మళ్లీ ప్రాచుర్యం పెరుగుతోందని, దీర్ఘకాలిక రోగాలను ఆయుర్వేద వైద్యంతో నయం చేయవచ్చన్నారు. ఈ మందుల వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

గజపతినగరం: అగ్నిప్రమాదాల నివారణపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అగ్నిమాపకశాఖ అధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, ఫ్యాక్టరీలు, తదితర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు ఆందోళన చెందకుండా అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడవచ్చన్నారు.

# నులిపురుగులను నులిమేద్దాం..



బొండపల్లి: డీవార్మింగ్ డే వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మెరకముడిదాం: మండల పరిధిలో 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని ఎంపీడీఓ ఎం.పావని అన్నారు. ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని(డీవార్మింగ్ డే) పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో మెరకముడిదాం పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి సంబంధిత పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఆల్బెండజోల్–400 ఎంజీ మాత్రలను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు వేయించాలని సూచించారు. వైద్య సిబ్బందితో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ప్రసాద్, ఈఓపీఆర్డీ కె.పుష్పరావు, పీహెచ్‌సీ సిబ్బంది రామారావు, జయవర్మ, తదితరులు పాల్గొన్నారు.

● బొండపల్లి: ఈనెల 9న నిర్వహించనున్న డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని కోరుతూ గొట్లాం హెల్త్ వెల్‌నెస్ కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు పిల్లలతో ఈ మాత్రలు వేయించాలని కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వసంత లక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ బి.విశ్వేశ్వరరావు, ఏఎస్ఎం సీహెచ్ లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటి బోరు ఏర్పాటుకు శంకుస్థాపన



బోరు తవ్వకాన్ని పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు

చీపురుపల్లి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో మండల పరిషత్ నిధులు లక్ష రూపాయలతో తాగునీటి బోరు ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసునాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్తుల కోరిక మేరకు మండల పరిషత్ నిధులతో తాగునీటి బోరు ఏర్పాటుకు డ్రిల్లింగ్ చేయిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రఘుమండ త్రినాథ్, బవిరి రవిశంకర్, స్థానికులు పాల్గొన్నారు.

## ఆసరా సంబరాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు

దత్తిరాజేరు: ఈనెల 11న కోమటిపల్లి రైల్వేగేట్ పక్కన ఉన్న లేఅవుట్‌లో నిర్వహించే ఆసరా సంబరాలను విజయవంతం చేయాలని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఓ అచ్యుతరావు అధ్యక్షతన బుధవారం జరిగిన విలేజ్ బుక్ కీపర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశారని, ఆ నిధులను సభ్యుల ఖాతాల్లో జమ చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్ బాబు, ఇందుకూరి రఘురాజు ఆసరా సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు పాల్గొన్నారు.

## గణితంలో మెలకువలు నేర్చుకోవాలి



విద్యార్థులకు గణితం బోధిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని బల్లంకి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు బుధవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును, పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు కాసేపు గణితం బోధించారు. వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. దస్తూరీ మెరుగుపర్చుకోవాలని, ప్రతిరోజు పాఠశాలకు రావాలని, విధిగా యూనిఫాం ధరించాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రతిరోజు హోం వర్క్ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట సీఆర్పీలు లక్ష్మి, కోటేశ్వరరావు ఉన్నారు.

### 11న జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

వేపాడ: మండలంలోని చినగుడిపాల గ్రామంలో ఈనెల 11న జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించనున్నట్లు సర్పంచ్ బోజంకి రామునాయుడు బుధవారం తెలిపారు. గ్రామదేవత పరదేశి మాంబ తీర్థం సందర్భంగా 10, 11 తేదీల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు చెప్పారు. 10న భర్తవానిపాలెం మహిళా బృందంచే రాధాకృష్ణ కోలాటం, 11న మధ్యాహ్నం డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎడ్ల పరుగు ప్రదర్శన విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

## ఒలింపియాడ్‌లో ప్రతిభ

శృంగవరపుకోట: నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పోటీల్లో వెంకటరమణపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు హెచ్ఎం కె.లక్ష్మి బుధవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలో కె.గీతామాధురి, ఎ.గీతాంజలి, బి.దేవి, డి.హేమంత్, పి.అక్షయ, ఎం.కార్తీక్, కె.బాలస్వరూప్, యు.కుసుమవాణి, కె.పూజిత ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. వారిని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



ప్రతిభకనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఆర్ మాధవ్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఆర్ మాధవ్

గజపతినగరం: భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఆర్ మాధవ్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, అర్హులంతా వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి శ్రీనివాస్, విజయనగరం జిల్లా ఇన్‌చార్జ్ రామరాజు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ శంబర లక్ష్మీనరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు, బీజేపీ అసెంబ్లీ కో–కన్వీనర్ సరిది దుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు ఏడుకొండలు, సీనియర్ నాయకులు మండపాక భారతి, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో డిపో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్ వైద్యురాలు జి.అశ్విని సుమారు 50 మంది ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

### ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో నూతనంగా రామాలయం నిర్మాణానికి దేవదాయ శాఖ రూ.30 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు గ్రామ సర్పంచ్ చెలుబోను ముసలినాయుడు(బాలబాబు) బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెప్పారన్నారు. నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### రైల్వే సమస్యలపై సమావేశం రేపు

చీపురుపల్లి రూరల్: రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై ఈనెల 9న ఉదయం 10 గంటలకు రైల్వేస్టేషన్ వద్ద సమావేశం నిర్వహించనున్నట్లు చీపురుపల్లి రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు ఇప్పిలి నీలకంఠం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో గల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సమావేశంలో వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. సమస్యలపై 9010513506 ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

### నేడు నేత్రవైద్య శిబిరం

మెరకముడిదాం: స్థానిక పీహెచ్‌సీలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరకముడిదాంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

### మద్యం సీసాలతో మహిళ అరెస్ట్

దత్తిరాజేరు: అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్.బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కె.కొత్తవలస వద్ద తనిఖీలు నిర్వహించగా.. అదే గ్రామానికి చెందిన మహిళ మద్యం సీసాలు తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### నేటి నుంచి వీధి నాటకాలు

విజయనగరం ఫోర్ట్: బేటీ బచావో బేటీ పడావో పథకంలో భాగంగా పిల్లలు, మహిళలకు రక్షణ కల్పించే చట్టాలపై స్త్రీ, శిశు సంక్షేమ ఆధ్వర్యంలో బుర్రకథలు, వీధి నాటకాలు ప్రదర్శించనున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి బి. శాంతకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 35 కార్యక్రమాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమాలకు ప్రజలు హాజరుకావాలని కోరారు.

### ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి

విజయనగరం అర్బన్: శ్రీకాకుళం జిల్లా సారవకోట, మెళియాపుట్టి, మందస మండలాల నుంచి పలువురు గిరిజనులు పట్టణంలోని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును బుధవారం కలిశారు. గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో వచ్చిన వీరు ఆయన్ని కలిసి పోడు పట్టాలు, ఉపాధికి సంబంధించిన పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి శంకరరావు స్పందిస్తూ, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన్ను కలిసిన వారిలో గిరిజన ఐక్య వేదిక నాయకులు చౌదరి లక్ష్మీనారాయణ, శాంతారావు, భాస్కరరావు, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

### డీఏతో కలిపి వేతనాలివ్వాలి..

నెల్లిమర్ల: జూట్ కార్మికులకు ఫిబ్రవరి నెల డీఏతో కలిపి వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, జూట్ యాజమాన్యం 2016 నుంచి పేరుకుపోయిన గ్రాట్యుటీ బకాయిలు చెల్లించలేదన్నారు. అంతేకాకుండా రిటైర్డ్ కార్మికులకు యాజమాన్యం ప్రతి నెలా గ్రాట్యుటీ చెక్కులు ఇవ్వాల్సి ఉండగా... యాజమాన్యం రెండు నెలలు, మూడు నెలలకు ఒక సారి ఇవ్వడం సరికాదన్నారు.

## ● మంచుదుప్పటి



పొగమంచు కారణంగా లైట్లు వేసుకుని వెళ్తున్న రైలుబండి



గజపతినగరం జాతీయ రహదారిపై లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న వాహనాలు

గజపతినగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో బుధవారం మంచుదుప్పటి కప్పేసింది. ఉదయం 9 గంటలు దాటినా మంచుతెరలు వీడకపోవడంతో వివిధ పనులపై ఇంటి నుంచి బయటకు వెళ్లే వారంతా ఇబ్బందిపడ్డారు. ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగా కనిపించకపోవడంతో వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. దట్టంగా కురుస్తున్న పొగమంచు కారణంగా మామిడి పూత రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. – గజపతినగరం



మంచుదుప్పటిలో పురిటిపెంట న్యూకాలనీ



స్థానిక బాలుర హైస్కూల్ వద్ద కురుస్తున్న పొగమంచు

## శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



కళారూపాలతో అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

చీపురుపల్లి రూరల్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించటానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 15 వరకు శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు రాష్ట్రస్థాయి సైన్స్ కళాజాతా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం కళాకారుల బృందం పలు కళా ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు. ప్రతి ఒక్కరూ మూఢనమ్మకాలు విడనాడాలని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ కోరారు. ఈ సందర్భంగా డైట్ అధ్యాపకులు సూర్యారావు, శ్రీనివాసరావు, ప్రవీణ్‌కుమార్, దామోదరరావులతో కూడిన బృందం పాఠశాలలో విద్యార్థుల విద్యాప్రమాణాలు, అభ్యసనాభివృద్ధి కార్యక్రమాల అమలుతీరును పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్, వేదిక జిల్లా ప్రతినిధులు కె.మురళీబాబు, ఎస్.సింహాద్రినాయుడు, ఎ.సత్యశ్రీనివాసు, వి.మోహనరావు, వి.నీలయ్య, ఎం.శ్రీనివాసరావు, ఎస్.అప్పలనాయుడు, గొర్లె రమణ, బి.అప్పలస్వామి, మిరాయల కృష్ణారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మోతాదుకు మించి ఎరువులు వాడరాదు

● జిల్లా వ్యవసాయశాఖాదికారి రామారావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాదికారి రామారావు

మెంటాడ(గజపతినగరం రూరల్): రైతులు పరిమితికి మించి ఎరువులను వినియోగించడం వల్ల నేల, గాలి, వాయు కాలుష్యం పెరుగుతుందని, తద్వారా మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖాధికారి వి.టి.రామారావు అన్నారు. మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో కత్తెర పురుగు నివారణపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. పంటకు అవసరమైన మోతాదులో ఎరువుల వినియోగించాలని సూచించారు. సేంద్రియ ఎరువులు వినియోగంతో సాగు ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందని, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. శాస్త్రవేత్త ఎంపీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పంటకోత ప్రయోగం తరువాత పొలాల్లో మిగిలిన దుబ్బులను చిన్నముక్కలుగా చేసుకుని నేలలో కలపడం వల్ల నేల సారవంతమవ్వడమే కాకుండా పంట ఏపుగా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, మండల వ్యవసాయాశాఖాధికారి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలను విడనాడండి

● ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మలత



కళాజాత నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

నెల్లిమర్ల రూరల్: మూఢ నమ్మకాలను విడనాడి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ జె. పద్మలత సూచించారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మానవుడు రోదసీలో ప్రయాణిస్తున్నా ప్రజలు మూఢ నమ్మకాలపై జాడ్యం వీడలేదన్నారు. విద్యార్థులు చైతన్యవంతులై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర స్థాయి సైన్స్ కళాజాతలో భాగంగా జనవిజ్ఞాన వేదిక బృంద సభ్యులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాజాత అధ్యక్షుడు మురళీధర్, పాఠశాల హెచ్ఎం బంగారునాయుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ప్రతినిధులు కామేశ్వరరావు, వెంకటరావు, మురళీబాబు, తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత ఆహారంతో విద్యార్థులకు అస్వస్థత

విజయనగరం ఫోర్ట్: కలుషిత ఆహారం తీసుకోవడంతో జేఎన్‌టీయూ జీవీ విద్యార్థులు కొందరు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. ఉదయం 10 గంటల సమయంలో కొందరు విద్యార్థులు వాంతులు, వికారంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చారు. వారికి క్యాజువాలటీలో వైద్యులు చికిత్స అందించారు. ఆరోగ్యం బాగుండడంతో హాస్టల్‌కు పంపించేశారు. రాత్రి 10 గంటల సమయంలో మరో ఏడుగురు విద్యార్థినులు వాంతులు, వికారంతో సర్వజన ఆస్పత్రికి వచ్చారు. వారికి వైద్యులు వైద్యసేవలు అందించారు. కలుషిత ఆహారం తీసుకోవడమే కారణమని వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రిలో సేవలు పొందిన వారిలో ఎం.కళ్యాణి, ఎం.ప్రియ, ఆర్.సుధ, కె.చంద్రిక, బి.తేజశ్విని, పి.విద్యేశ్వని, డి.మనీష ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com